మరి ఇదేంది గాంధీ..?

- కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ఎక్స్‌లో వెల్లడించిన అరికపూడి
- సీఎంతో దిగిన ఫొటోలు జూలై 13న ట్వీట్‌కు ట్యాగ్
- మెడలో మెరుస్తున్న సీఎం కప్పిన కాంగ్రెస్ కండువా
- అరికపూడి చేరికను ధ్రువీకరిస్తూ వేం నరేందర్‌రెడ్డి ట్వీట్

నేడు కాంగ్రెస్‌లో చేరనేలేదంటూ బాహాటంగా అబద్ధాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ వ్యవహారశైలిని ప్రజలు చీదరించుకుంటున్నారు.మహాత్ముడి పేరు పెట్టుకున్న ఆయన ఆ పేరును చెడగొట్టేలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. నైతిక విలువలు లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతుండటంపై సొంత నియోజకవర్గ ప్రజలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలక్రితం తాను సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ప్రకటించుకున్న ఆయన.. ఇప్పుడేమో తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదంటూ నాలుక మడతేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కలిసినట్టు బుకాయిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ సూచించిన సభ్యునికి ఇవ్వాల్సిన పీఏసీ కమిటీ చైర్మన్ పదవిని కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దక్కించుకున్నారు. దీనిపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తున్నది. దీంతో అరికపూడి గాంధీ ప్లేట్ ఫిరాయించారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదంటూ అబద్ధాలు చెప్తున్నారు.



నేను కాంగ్రెస్ పార్టీలో చేరిన...

జూలై 13న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'ఈ రోజు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సీనియర్ నాయకుడు మొవ్వ సత్యనారాయణ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు, ముఖ్య అనుచరులు, అభిమానులతో కలిసి కాంగ్రెస్‌లో చేరడం జరిగింది' అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను రేవంత్‌రెడ్డికి, రాహుల్ గాంధీకి, ఐఎన్‌సీ తెలంగాణ, ఇండియాకు ట్యాగ్ చేశారు. నాడు ఇంత అర్భాటంగా కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రకటించుకొని, ఇప్పుడేమో తాను కాంగ్రెస్ పార్టీలో చేరనేలేదంటూ ప్లేట్ ఫిరాయించడంపై నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

ధ్రువీకరించిన వేం నరేందర్‌రెడ్డి

అరికపూడి కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ధ్రువీకరించారు. ఆయన కూడా జూలై 13న తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. 'శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, పలువురు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది' అంటూ వారి ఫొటోను జత చేశారు. అరికపూడి కాంగ్రెస్‌లో చేరారనేందుకు ఇంతకన్నా సాక్ష్యం ఇంకేం కావాలి.

మెడలో మెరుస్తున్న కాంగ్రెస్ కండువా

అరికపూడిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు. తన మెడలో కప్పింది కాంగ్రెస్ కండువా కాదని, అది ఆలయాల్లో కప్పే కండువా అని గాంధీ చెప్పుకొచ్చారు. ఫొటోల్లో మాత్రం ఆయన చెప్పిన దానికి పూర్తి భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి మెడలో దేవాలయాల్లోని కండువా ఉంటే అరికపూడి గాంధీ మెడలో కాంగ్రెస్ కండువా కనిపిస్తున్నది. తన మెడలో దేవాలయ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేరిన మిగిలిన వారికి మాత్రం కాంగ్రెస్ కండువా కప్పారని కూడా గాంధీ తెలిపారు. ఆ ఫొటోలో తనతోపాటు పార్టీలో చేరిన వారందరి మెడలో కాంగ్రెస్ కండువా ఉండటం గమనార్హం.

నీతులు చెప్పిన తెల్లారే రేవంత్ గోతులు

- ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ సర్కార్ ఖూనీ చేసింది
- పీఏసీ పదవికి హరీశ్ వేసిన నామినేషన్ ఏమైంది?
- ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ ఎట్లిస్తరు?
- తన నిర్ణయంపై స్పీకర్ పునరాలోచించాలి
- తెలంగాణ పరిణామాలపై రాహుల్ స్పందించాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరగా పత్రికలో వచ్చిన వార్తను చూపిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీలో సంప్రదాయానికి, నిబంధనలకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షానికే పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం దేశంలో ఆనవాయితీగా వస్తున్నదని, ఈ పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఇవ్వడం పార్లమెంటరీ స్ఫూర్తికి, సంప్రదాయాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ ఖూనీ చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరికెపూడి గాంధీని అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పీఏసీకి హరీశ్‌రావు వేసిన నామినేషన్ పత్రాలు ఏమయ్యాయని, హరీశ్ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమని ప్రశ్నించారు. స్పీకర్ భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్ఎస్‌ను కాల్చాలని చూస్తున్నారని, మొన్న జర్నలిస్టుల మీటింగ్‌లో సీఎం రేవంత్ నీతులు చెప్పి, తెల్లారే గోతులు తవ్వారని ఎద్దేవా చేశారు. నామినేషన్ వేయని అరికెపూడి గాంధీకి పదవి ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని, దీనిపై స్పీకర్ పునరాలోచన చేయాలని కోరారు. బీఆర్ఎస్ నేత రవీందర్ సింగ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థలను ధ్వంసం చేశారని కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్, పీఏసీ కమిటీల విషయంలో అతి పెద్ద ధ్వంసం చేశారని మండిపడ్డారు. 'రాహుల్ గాంధీ మాట కూడా వినలేని స్థాయికి రేవంత్ వెళ్లారా?, కాంగ్రెస్‌లో సీనియర్ అయిన జానారెడ్డి లాంటి వారు కూడా రేవంత్‌కు చెప్పే స్థితిలో లేరా?' అని ప్రశ్నించారు. గత అసెంబ్లీ సమావేశాల చివరి రోజున కమిటీల ఎన్నిక షెడ్యూల్ ప్రకటించారని, పీఏసీ ఎన్నిక పూర్తయిన తర్వాత స్పీకర్ అసెంబ్లీలోనే కమిటీ సభ్యుల పేర్లు ప్రకటించాలని, కానీ అందుకు విరుద్ధంగా 38 రోజుల తర్వాత కమిటీలను ప్రకటించారని చెప్పారు. బీఆర్ఎస్‌కు నిబంధనల ప్రకారం పీఏసీలో ముగ్గురు సభ్యులకు అవకాశం ఉంటుందని, తాను, హరీశ్‌రావు, గంగుల కమలాకర్ నామినేషన్ వేసినట్టు తెలిపారు. కానీ మధ్యలో అరికెపూడి గాంధీ పేరు ఎక్కడినుంచి వచ్చిందని ప్రశ్నించారు. సభ్యుల కన్నా ఎక్కువ నామినేషన్లు వస్తే ఓటింగ్ జరగాలని, కానీ ఓటింగ్ జరగకుండానే హరీశ్‌రావు నామినేషన్‌ను ఎలా తొలగించారని నిలదీశారు.

ఇదే విధానంలో ఢిల్లీలో అమలైతే?

తెలంగాణ ఏర్పడ్డాక ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన పీ కృష్ణారెడ్డి, గీతారెడ్డి, అక్బరుద్దీన్‌లకు నిబంధనల ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చామని ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు యనమల రామకృష్ణుడు, నాగం జనార్దన్‌రెడ్డికి పదవి ఇచ్చారని చెప్పారు. మోదీ హయాంలో మొదటి రెండు పర్యాయాలు కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా లేకున్నా పీఏసీ చైర్మన్ పదవులు దక్కాయని, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సూచన మేరకు కేసీ వేణుగోపాల్‌కు కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని, కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఓ సూత్రం, తెలంగాణలో మరో సూత్రమా? అని నిలదీశారు. రేవంత్ విధానాన్ని ఢిల్లీలో పాటిస్తే అక్కడ కేసీకి పీఏసీ చైర్మన్ పదవి వచ్చేదా? అని ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేల పెన్షన్ తొలగించారని, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేకు పిలిచి పీఏసీ పదవి ఇచ్చారని ఇదేం ద్వంద్వ వైఖరి అని ధ్వజమెత్తారు. పీఏసీపై స్పీకర్ నిర్ణయం మారకపోతే ఇతర మార్గాలు అన్వేషిస్తామని చెప్పారు. గాంధీ బీఆర్ఎస్‌కు చెందిన వాడని మంత్రి శ్రీధర్‌బాబు చెప్తున్నారని, గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించాలని కేసీఆర్ సూచించారా? అని, కేసీఆర్‌ను ఎపుడు సంప్రదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పెద్ద నియంతలా మారాడని, ఆయన తీరును ప్రతిఘటించి తీరుతామని హెచ్చరించారు.

- యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం మహాద్భుతంగా రూపుదిద్దుకున్నదని 16వ ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ ఝా, మనోజ్ పాండా కితాబునిచ్చారు. జాయింట్ సెక్రటరీ కేకే మిశ్రా, జాయింట్ డైరెక్టర్ దావిందర్ చోడా, డిప్యూటీ డైరెక్టర్ అభిషేక్ నందన్, అసిస్టెంట్ డైరెక్టర్ భద్‌బేష్ హజారిక, కలెక్టర్ హనుమంతు కే జెండగేతో కలిసి మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి వారికి స్వామివారి ప్రసాదాలు అందించారు. -యాదగిరిగుట్ట

- హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు

హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయవద్దంటూ మంగళవారం ట్యాంక్‌బండ్ మార్గంలో జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ పోలీసుల పేరిట ప్లెక్సీలు వెలిశాయి. ఈ విషయంపై వాహనదారులు, భక్తుల్లో చర్చ జరిగింది. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనంపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదన్న పిటిషన్‌ను ఇదేరోజు కోర్టు తోసిపుచ్చింది. 2021 ఆదేశాల ప్రకారం నిమజ్జనం చేయాలని సూచించింది. పీవోపీ విగ్రహాలను తాత్కాలిక పాండ్స్‌లో నిమజ్జనం చేసుకోవచ్చని అనుమతించడం గమనార్హం. - హైదరాబాద్ సిటీబ్యూరో

నేత కార్మికుడి ఆత్మహత్య

- పురుగుల మందు తాగి బలవన్మరణం
- కరీంనగర్ జిల్లాలో విషాదం

రాంనగర్ (కరీంనగర్), సెప్టెంబర్ 10 : ఉపాధి లేక.. అప్పుల పాలై చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన గుండేటి గణేశ్ (38) సాంచాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఉపాధి లేక కుటుంబ కలహాలతో ఆరు నెలల కిందట భార్య కొడుకును తీసుకొని పుట్టింటికి వెళ్లింది. సుమారు రూ.3 లక్షల వరకు అప్పు కావడంతో తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. 'ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నా. నా మృతదేహాన్ని మున్సిపాలిటీ వారికి అప్పగించాలి' అని సూసైడ్ నోట్ రాసి సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. తండ్రి మల్లేశం గమనించి వెంటనే చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

అరికెపూడి తెలంగాణ భవన్‌కు రావాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : తాను ప్రతిపక్షంలోనే ఉన్నానని అంటున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలంగాణ భవన్‌కు రావాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. పీఏసీ(పబ్లిక్ అకౌంట్స్ కమిటీ)చైర్మన్‌గా నియమితులైన గాంధీ వ్యాఖ్యల్ని ఆయన తప్పుబట్టారు. పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే నియమించాలనే నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని నిసిగ్గుగా తాను ప్రతిపక్షంలోనే ఉన్నానని పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.

ఆ 10 మంది ఎమ్మెల్యేల్లో అంతర్మథనం

హైకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యులతో సమాలోచనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'పార్టీ మారి తప్పు చేశామా?'- ఇదీ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల్లో మొదలైన అంతర్మథనం. 'నిన్నమొన్నటిదాకా ఏం కాదులే అనుకున్నాం. కానీ, హైకోర్టు తీర్పుతో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏంచేయాలో అర్థం కావడం లేదు. ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టే ఉన్నది' అని పార్టీ మారిన ఎమ్మెల్యే ఒకరు తన సన్నిహితులతో వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, ఆ పార్టీ శ్రేణులు సహకరించడం లేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు వస్తే తట్టుకొని నిలబడటం కష్టమని సదరు ఎమ్మెల్యే మథనపడుతున్నారని ఆయన అనుచరులు బాహాటంగానే చెప్తున్నారు. గద్వాల, భద్రాచలం, స్టేషన్‌ఘన్‌పూర్, జగిత్యాల, బాన్సువాడ, చేవెళ్ల, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, రాజేంద్రనగర్ ఈ పది నియోజకవర్గాల్లో హైకోర్టు తీర్పు హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏదో గాలి వీచింది కానీ, ఇప్పుడా పరిస్థితి లేదని పార్టీ మారిన ఎమ్మెల్యేలు బలంగా నమ్ముతున్నట్టు సమాచారం. కోర్టు తీర్పు అనంతరం ఫుల్‌బెంచ్‌కు వెళ్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొనడం, తానింకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) చైర్మన్‌గా నియమితులైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వ్యాఖ్యానించడానికి అంతర్మథనమే కారణమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

సర్కార్‌పై వ్యతిరేకత.. కాంగ్రెస్‌లో తిరుగుబాటు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్న అసంతృప్తి వివిధ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. రుణమాఫీ విషయంలో రైతుల నిరసనలు చేయని నియోజకవర్గమే లేదు. వానకాలం సీజన్ ముగింపు దశకు వచ్చినా రైతుభరోసాపై స్పష్టత రాలేదు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు ఆసరా పింఛన్ల పెంపుతోపాటు ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కదానినీ సంపూర్ణంగా అమలుచేయకపోవడం వివిధ వర్గాల్లో అసంతృప్తికి కారణమవుతున్నదని పార్టీ మారిన ఎమ్మెల్యేలు భావిస్తున్నట్టు తెలుస్తున్నది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పార్టీ మారిన ఎమ్మెల్యేలకు శరాఘాతంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కొద్దిరోజులకు తత్వం బోధపడిన కొంతమంది ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి పదవులు ఆశ చూపారు. ఈ అంశం కూడా కాంగ్రెస్ పార్టీని అతలాకుతలం చేస్తున్నది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కట్టబెట్టిన పదవులు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును తీవ్రతరం చేశాయి. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న గద్వాల, జగిత్యాల, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌లో వర్గపోరు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నది. ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్యాడర్ ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, మరోవైపు కాంగ్రెస్‌లో తిరుగుబాటుతో సతమతం అవుతున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు ఆ ఎమ్మెల్యేలకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై ఉప ఎన్నికల కత్తి వేలాడనున్నది.

అనర్హతపై నిర్ణీత గడువేదీ లేదు

మొదటిపేజీ తరువాయి...

షెడ్యూల్‌కు సంబంధించి న్యాయస్థానాలు శాసనవ్యవస్థలకు ఆదేశాలు ఇవ్వొచ్చా అన్న అంశంపై కూడా సమీక్షిస్తున్నట్టు తెలిపారు. సీఎల్పీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించి ఇచ్చిన తీర్పులో హైకోర్టు నాలుగు వారాల్లో ప్రక్రియను మొదలుపెట్టాలని మాత్రమే చెప్పిందని, రేపే నిర్ణయం తీసుకోవాలని చెప్పలేదని అన్నారు. అదేవిధంగా పదో షెడ్యూల్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ఎక్కడా కూడా నిర్ణీత గడువు పేర్కొనలేదని చెప్పారు. రోజులా, నెలలా, సంవత్సరాలా అన్న విషయం చెప్పలేదని అన్నారు.

నిబంధనల ప్రకారమే పీఏసీ చైర్మన్ ఎన్నిక

శాసనసభ స్పీకర్ రాజ్యాంగ స్ఫూర్తితో, నిబంధనలకు అనుగుణంగా ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఒక ప్రక్రియ ప్రకారమే స్పీకర్ ఫైనాన్షియల్ కమిటీలను ఏర్పాటు చేశారని చెప్పారు. స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ పార్టీ అడ్డగోలుగా మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముతుందని, రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్తున్నదని అన్నారు. పీఏసీ చైర్మన్‌గా నియమితులైన వ్యక్తి.. తాను స్వయంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పారని అన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ సూచించిన మూడు పేర్లు కాకుండా మరో వ్యక్తిని నియమించారనే ఆరోపణలపై మంత్రి సమాధానాన్ని దాటవేశారు.

వస్తామంటే.. వద్దంటామా!

ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తామంటే రావొద్దని అంటామా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. తమ పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలంటూ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారని, మరి ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే ఎమ్మెల్యేలకు కూడా అదే వర్తిస్తుందా అని ప్రశ్నించగా.. అభివృద్ధి కోసం వస్తుంటే రాళ్లతో ఎందుకు కొట్టాలని ఎదురు ప్రశ్నించారు.

పార్టీ ఫిరాయింపులను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తా. దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇచ్చిన వినతిపత్రాన్ని కార్యదర్శికి పంపించా. దానిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాను. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును బట్టి ఓ పార్టీ నుంచి గెలిచిన తర్వాత ఆ వ్యక్తి ఆ పార్టీకే అండగా ఉండాలని భావించే వ్యక్తిని నేను. స్పీకర్ హోదాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా నా ప్రయత్నం ఉంటది.

-జూలై మొదటి వారంలో ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

'రాజ్యాంగంలోని పదో షెడ్యూలు ప్రకారం శాసనసభ స్పీకర్ వ్యవస్థ.. ఒక ట్రిబ్యునల్ (న్యాయ ప్రాధికార సంస్థ) వంటిది. అందువల్ల ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్ల మీద వారు నిర్ణీత సహేతుక కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి. కొన్ని అసాధారణ సందర్భాలను మినహాయిస్తే, నిర్ణీత సహేతుక కాల వ్యవధి అంటే, అనర్హత దరఖాస్తు ఇచ్చిన తర్వాత గరిష్ఠంగా మూడు నెలల లోపలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది! నిబంధనలను ఉల్లంఘించి పార్టీ ఫిరాయించిన వారిపై పదో షెడ్యూలు మేరకు అనర్హత వేటు వేసి, రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలంటే, స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి.'

-మహారాష్ట్ర గవర్నర్, తదితరులపై కేసులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ నర్సింహతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. మే 11, 2023న వెలువరించిన తీర్పు

'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఒక సభ్యుడి అనర్హతపై స్పీకర్ సత్వర నిర్ణయం తీసుకోవడానికి న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలనుకుంటే కచ్చితంగా చేసుకోవచ్చు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షను కిహోటో హోలోహాన్ కేసు తీర్పు (1992)లోని 110, 111 పేరాలు ఏవిధంగానూ అడ్డుకోవడం లేదు. అనర్హతపై స్పీకర్ తుది నిర్ణయం తర్వాత న్యాయ సమీక్షకు కచ్చితంగా అవకాశం ఉన్నది. ఒకవేళ స్పీకర్ తాత్కాలిక అనర్హత, లేదా సస్పెన్షన్ చర్యలు తీసుకుంటే, కోర్టు కూడా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వవచ్చు'

-మణిపూర్ అసెంబ్లీ స్పీకర్ తదితరులపై కైషమ్ మేఘచంద్రసింగ్ వేసిన కేసులో జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రామసుబ్రమణ్యంతో కూడిన ధర్మాసనం 2020 జనవరి 21న వెలువరించిన తీర్పు

హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ వర్సెస్ ఆర్‌ఆర్ కాంగ్రెస్
- పీఏసీ చైర్మన్ అనైతిక ఎంపికకు తాము వ్యతిరేకం
- బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని గతంలో తాము పిటిషన్ వేశామని, దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ముందుంచాలని, నాలుగు వారాల్లోగా షెడ్యూల్ నిర్ణయించాలని స్పీకర్ కార్యదర్శిని ఆదేశించడం చరిత్రాత్మకమని చెప్పారు. హైకోర్టు తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లి తీర్పును గౌరవించేలా చొరవ చూపాలని సూచించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు పార్టీ మారితే వారిండ్ల ముందు చావు డప్పు కొట్టమన్నారని, ఇప్పుడు ఆయనే అనైతికంగా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో నేతలు ఇందిరా కాంగ్రెస్, ఆర్‌ఆర్ కాంగ్రెస్‌గా విడిపోయారని, ఆర్‌ఆర్ కాంగ్రెస్‌కు ఏఐసీసీకి మధ్య సమన్వయలోపం నెలకొన్నదని చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడే ఎమ్మెల్యేలను అసెంబ్లీ సభ్యత్వానికి అనర్హత వేటు వేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇందిరా కాంగ్రెస్ నిర్ణయాలు ఆర్‌ఆర్ కాంగ్రెస్ అమలు చేయదా? అని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ విషయంలోనూ సంప్రదాయాలకు విరుద్ధంగా పనిచేశారని విమర్శించారు. ఇతర పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పార్టీ మారిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్ పదవి దినదినగండం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదవి దినదిన గండంగా మారిందని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పీసీసీ అధ్యక్ష పదవి ఆయన చెప్పిన వారికి ఇవ్వలేదని, హైకోర్టు తీర్పుపై మంత్రి పొన్నం వ్యాఖ్యలతో మంత్రులకు సీఎంకు మధ్య గ్యాప్ ఉందన్న విషయం బయటపడిందని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు ప్రజలకిచ్చిన హామీలను, వరద బాధితులకు సాయం వదిలేసి, కలెక్షన్ల బిజీలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆర్ ట్యాక్స్, ఆర్‌ఆర్ ట్యాక్స్, ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ ఇలా కలెక్షన్లలో మునిగితేలుతున్నారని మండిపడ్డారు. హైడ్రా ఆరంభ శూరత్వమేనని, కావాలనే హైడ్రా కోరలను సీఎం పీకేశారని విమర్శించారు. కుటుంబ ఒత్తిళ్లు, ఒవైసీకి భయపడి హైడ్రాపై సీఎం వెనక్కి తగ్గారని, హైడ్రా వెనుక రూ.వందల కోట్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు.

ఇంకా చాలా బెంచ్‌లు ఉన్నాయి

- హైకోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తాం
- ఉపఎన్నికలు వస్తాయో లేదో తెలియదు: కడియం

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10: పార్టీ ఫిరాయింపుల విషయమై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్టు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అయిపోలేదని, ఇంకా బెంచ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పును గౌరవిస్తామని అన్నారు. న్యాయ నిపుణుల సలహాల మేరకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గతంలో సుప్రీం కోర్టు రెండు రకాల తీర్పు ఇచ్చిందని, హైకోర్టు, సుప్రీం కోర్టులు భిన్నమైన తీర్పులు ఇచ్చినట్టు తెలిపారు. హైకోర్టు తీర్పుతో ఏదో అయిపోయిందని, అప్పుడే ఉపఎన్నిక వచ్చినట్టుగా కొందరు సంబురాలు చేసుకోవడం సరికాదని, అసలు ఉప ఎన్నికలు వస్తాయో లేదో తెలియదని అన్నారు. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాపీలు ఇంకా తమకు అందలేదని పేర్కొన్నారు.